
తొగుట: గుడికందుల సర్పంచ్ మల్లయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

అండగా ఉంటాం..

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట, ఫిబ్రవరి 11: మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని గుడికందులలో సర్పంచ్ గంగనిగల్ల మల్లయ్య సతీమణి రాజవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విజయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన బంగారుగళ్ల రాజయ్య అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అంతకుముందు కాన్గల్‌లో వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి గృహ ప్రవేశం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి మల్లన్న ఆలయం వద్ద జరిగిన ఆత్మీయుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు భోంపల్లి మనోహర్‌రావు, రొట్టె రాజమౌళి పంతులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, ఎంపీటీసీ కొమ్ము శరత్, మండల మాజీ అధ్యక్షుడు చిలువేరి మల్లారెడ్డి, నాయకులు తొయేటి ఎల్లం, బక్క కనకయ్య, పులిరాజు, గురువారెడ్డి, బాల్‌రెడ్డి, నంట పరమేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటాం

మిరుదొడ్డి, ఫిబ్రవరి 11: పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మోతె గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కొండా వెంకటేశం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వెంకటేశ్‌కు పార్టీ క్రియాశీల సభ్యత్వం ఉన్నందున రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే ఆదివారం మృతుడి భార్య కొండా లక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మోతె మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలి

విజేతకు నగదు బహుమతి, ట్రోఫీని అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


రన్నరప్ జట్టుకు నగదు బహుమతితోపాటు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఫిబ్రవరి 11: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలని, గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చిన ఘనత కేసీఆర్ కప్‌కే దక్కిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో నిర్వహించిన కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన అంబేద్కర్ ఆజాద్ జట్టుకు రూ.2 లక్షల నగదు బహుమతితో పాటు ట్రోఫీ, రన్నరప్‌గా నిలిచిన మిట్టపల్లి జట్టుకు రూ.లక్ష నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన ఆఫ్రిదికి రూ.50 వేల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. సిద్దిపేటలో అంతర్జాతీయ స్థాయి క్రీడా సౌకర్యాలు కల్పించామని, దీనిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులకు తనవంతు ప్రోత్సాహం ఉంటుందన్నారు.

సూర్య నమస్కారాల పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన హాసిని

చేర్యాల, ఫిబ్రవరి 11: వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారాల పోటీల్లో చేర్యాలకు చెందిన యోగా అభ్యాసకురాలు, కేంద్రీయ విద్యాలయంలో 5వ తరగతి చదువుతున్న మంతపురి హాసిని రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఈ పోటీల్లో 400 మందికి పైగా పాల్గొనగా, హాసిని 661 సూర్య నమస్కారాలతో మహిళా విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా బంగారు పతకంతో పాటు రూ.5 వేల నగదు బహుమతి అందుకుంది.


మాజీ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న హాసిని

వివరాలు నమోదు చేయించుకోవాలి

చేర్యాల, ఫిబ్రవరి 11: గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందేందుకు వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ట్రాన్స్‌కో ఏడీఈ రత్నాచారి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్‌ను వారి సర్వీస్ నంబర్‌తో ఈనెల 14లోపు అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. గృహజ్యోతి పథకం అమలు చేసేందుకు విద్యుత్ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తు నంబర్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్లను పేపర్‌పై పొందుపర్చి ఆయా మండల కేంద్రాల్లోని విద్యుత్ కార్యాలయాల వద్ద సిబ్బందికి అందజేయాలన్నారు.

దాడి ఘటనలో ముగ్గురికి రిమాండ్

చేర్యాల, ఫిబ్రవరి 11: రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ చేర్యాల అధ్యక్షుడు నేతి నారాయణపై దాడి చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దామోదర్ తెలిపారు. మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిపై దాడి ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు

చేర్యాల, ఫిబ్రవరి 11: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మహేంద్రకుమార్ తెలిపారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం చేర్యాల మండలం నాగపురిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ముగ్గురి వ్యక్తులపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి సుమారు 62 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

అక్రమ కలప పట్టివేత

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 11: రెండు డీసీఎం వాహనాల్లో అక్రమంగా కలపను తరలిస్తుండగా సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సిద్దిపేట రూరల్ మండలం బండచెర్లపల్లి గ్రామ శివారులో రెండు డీసీఎం వాహనాల్లో కలప తరలిస్తుండగా ఆదివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. డీసీఎంలను సీజ్ చేసి సిద్దిపేట రూరల్ పోలీసులకు అప్పగించారు. డీసీఎం డ్రైవర్లు మంగళారపు కనకయ్య, ఆంజనేయులు బండచెర్లపల్లి గ్రామస్తులుగా గుర్తించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు పచ్చదనం అందించాలంటే అడవుల శాతం పెంచాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా చెట్లు నరికివేస్తే వెంటనే 8712667447, 8712667446 లేదా 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

మృతదేహం లభ్యం

మిరుదొడ్డి, ఫిబ్రవరి 11: కూడవెల్లి వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మిరుదొడ్డి టౌన్‌లో చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఏఎస్సై తిరుమలబాబు వివరాల ప్రకారం.. మిరుదొడ్డికి చెందిన మద్దెల స్వామి(41) ఈనెల 9న మాఘ అమావాస్య పండుగను పురస్కరించుకొని కూడవెల్లి వాగులో స్నానం చేసి సీతారాములస్వామిని దర్శించుకోవడానికి భార్య, పిల్లలతో కలిసి టౌన్ శివారులోని కూడవెల్లి వాగు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో కూడవెల్లి వాగులో స్నానం చేస్తుండగా నీటి ఉధృతికి ప్రమాదవశాత్తు స్వామి కొట్టుకుపోయాడు. ఆదివారం మృతదేహం లభ్యంకావడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. భార్య సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

మంత్రాల నెపంతో వ్యక్తి హత్య

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 11: మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో నిమ్మ భూమయ్యను హత్య చేసినట్లు సిద్దిపేట రూరల్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదివారం సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీను, ఎస్సై కిరణ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈనెల 9న రాఘవాపూర్ శివారు పిట్టలవాడ సమీపంలో గుర్తుతెలియని శవం కాలిపోయిందనే సమాచారం రావడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడు నిమ్మ భూమయ్యగా గురించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా నిందితులు నిమ్మ కనకయ్య, నిమ్మ ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. రాఘవాపూర్ శివారులో భూమయ్యకు మద్యంలో పురుగుల మందు కలిపి తాగించారు. అపస్మారక స్థితికి చేరుకున్న భూమయ్యపై గడ్డి వేసి కాల్చి వేశారు. నిమ్మ భూమయ్య కుమారుడు, భూమయ్య తమ్ముడు నిందితులు కావడం విశేషం.

సాంద్రానంద ఆశ్రమంలో వార్షికోత్సవాలు

ఆశ్రమంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కొమురవెల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని మర్రిముచ్చాల శ్రీగురు సాంద్రానంద ఆశ్రమంలో నృసింహస్వామి వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆశ్రమ నిర్వాహకులు గౌరీభట్ల శ్రీనాథశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ శేషుశర్మ వైదిక నిర్వహణలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వార్షికోత్సవాలకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ప్రతి సంవత్సరం ఈ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.


స్వామివారి కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

పుల్లూరు జాతరకు పోటెత్తిన భక్తులు

- వైభవంగా నరసింహుడి కల్యాణోత్సవం

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 11: పుల్లూరు బండ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలిరావడంతో దర్శనానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. బండ కింద ప్రాంతం భక్తులతో సందడిగా మారింది. నరసింహుడి కల్యాణోత్సవం అర్చకులు వైభవంగా జరిపించారు. కల్యాణ మండపంలో స్వామివారిని దర్శించుకొని భక్తులు తరించారు. కల్యాణోత్సవంలో ఆలయ కమిటీ చైర్మన్ కనకయ్యగౌడ్, మాజీ చైర్మన్ కలకుంట్ల రంగాచార్యులు, మాజీ సర్పంచ్ నరేశ్‌గౌడ్, ఎంపీటీసీ లత, ఆలయ కమిటీ డైరెక్టర్లు, ఆలయ వంశపారంపర్య అర్చకులు పాల్గొన్నారు.

ఇర్కోడు ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 11: రాష్ట్ర స్థాయి చెకుముఖి పోటీల్లో ఇర్కోడు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం జనగాం జిల్లాలో నిర్వహించిన చెకుముఖి పోటీల్లో అశ్విన్, సూర్యతేజ, ఉదయ్ రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించారని చెప్పారు. విద్యార్థులను డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి భాస్కర్, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి అభినందించారని తెలిపారు.

బహుమతి అందుకుంటున్న విద్యార్థులు


మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కుమారుడి వివాహానికి హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావు

రసమయి కుమారుడి వివాహం

- హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 11: పట్టణ శివారులోని పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కుమారుడి వివాహం ఆదివారం జరిగింది. ఈ వివాహ వేడుకకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టణంలోని వయోలా గార్డెన్‌లో జరిగిన బీఆర్ఎస్ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు గోవిందారం రవి వివాహానికి, దేవి గార్డెన్‌లో జరిగిన సంతోషిమాత ఆలయం మాజీ చైర్మన్ కుమారుడి నిశ్చితార్థం, ముదిరాజ్ ఫంక్షన్‌హాల్, బైరి అంజయ్య, మెట్రో గార్డెన్స్‌లో జరిగిన పలు వివాహాలకు ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

బడ్జెట్‌లో దివ్యాంగుల ఊసేది..

- దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంపత్, యాదగిరి

హుస్నాబాద్, ఫిబ్రవరి 11: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దివ్యాంగుల ఊసే లేదని, దివ్యాంగుల సంక్షేమాన్ని విస్మరించిందని దివ్యాంగుల సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిట్టెల సంపత్, ప్రధాన కార్యదర్శి జింక యాదగిరి ఆదివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా దివ్యాంగుల బతుకులు కూడా మారుతాయనే ఆశతో ఎదురుచూస్తారని, అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం పింఛన్‌కే పరిమితం చేసి మిగతా సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్‌ను రూ.4 వేలకు పెంచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు నెలల పింఛన్ ఇప్పటివరకు రాలేదన్నారు. అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. దాని గురించి బడ్జెట్‌లో ప్రస్తావించక పోవడం దారుణమన్నారు. సమాజంలో అనేక అవమానాలు ఎదుర్కొంటున్న దివ్యాంగులు ఆత్మగౌరవంతో జీవించే అవకాశం లేకుండా పోయిందన్నారు. విద్యావంతులైన దివ్యాంగులకు ఉద్యోగ కల్పన లేక కుంగిపోతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జనవరి, ఫిబ్రవరి పింఛన్ వెంటనే ఇవ్వడంతో పాటు దివ్యాంగుల సంక్షేమంపై ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు.

రైతుల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

- మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణిశ్రీధర్‌రెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 11: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణిశ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం పట్టణంలో జరిగిన సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు రైతుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. సీఎం రేవంత్‌కి తెలంగాణ ప్రజలపై ఉన్న ప్రేమేంటో బడ్జెట్ కేటాయింపులో కనపడిందన్నారు. తెలంగాణ జల హక్కులను కాపాడేందుకు ఈనెల 13న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే చలో నల్గొండ కార్యక్రమానికి రైతులు కదలిరావాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారి బీఆర్ఎస్ నిర్వహించే భారీ బహిరంగ సభకు మాజీ సీఎం కేసీఆర్ హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, కౌన్సిలర్లు పచ్చిమడ్ల సతీశ్, నాయకులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఆర్యవైశ్యులు

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 11: కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో గజ్వేల్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు సిద్ది భిక్షపతి, గోళి సంతోష్‌కుమార్, తోట భిక్షపతి, శేఖర్‌గుప్తా, వెంకటేశం, ఉమేశ్ పాల్గొన్నారు.


బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 11: మద్దూరు మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున గ్రామం చుట్టూ పొత్తిపోశారు. ఉదయం 8.45కి వేద బ్రాహ్మణులతో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పంబాల పూజారులు పట్నం వేశారు. ఉదయం 11 గంటలకు బొడ్రాయికి బోనాలు సమర్పించారు. బొడ్రాయి వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం గ్రామం చుట్టూ సరుగు వేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవంలో మాజీ ఎమ్మెల్యే, డీసీసీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీ కొండల్‌రెడ్డిని మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి సన్మానించారు. నాయకులు మల్లేశం, శౌకత్‌అలీ, రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, ఫసీ అహ్మద్, ముంతాజ్ హుస్సేన్, ఫరీద్ పాల్గొన్నారు.

నేటి నుంచి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 11: నేటి నుంచి షిర్డీ సాయిబాబా ఆలయ 27వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కృష్ణమూర్తి, అధ్యక్షుడు శ్రీనివాస్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు పట్టణంలోని సాయిబాబా ఆలయం ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. 14న వసంత పంచమి, సాయి యజ్ఞం, కాగడ హారతి, స్వామివారి రథోత్సవం, అన్నదానం నిర్వహిస్తామన్నారు.

ఆలయ నిర్మాణానికి దాతల విరాళం

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని పందిల్ల మహాలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందించినట్లు మాజీ సర్పంచ్ రమేశ్ తెలిపారు. ఆదివారం గ్రామంలో ఆలయ కమిటీ సభ్యులకు వెల్దండి జ్యోతి-సత్యనారాయణ దంపతులు రూ.లక్షా 10 వేలు, వేమిరెడ్డి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం వారి సతీమణి సుగుణ, తనయుడు బుచ్చిరెడ్డి రూ.5,116 అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకొచ్చి విరాళాలు అందించాలని కమిటీ సభ్యులు కోరారు.

దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సిటిజన్ క్లబ్ అధ్యక్షుడిగా యాదగిరి ఎన్నిక

నాయిని యాదగిరి

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 11: గజ్వేల్ సిటిజన్ క్లబ్ అధ్యక్షుడిగా నాయిని యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో పాలక మండలికి పోటీ చేసిన అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారి అమరనాగేందర్ నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ఒక్కో పోస్టుకు ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు కాగా, ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. సిటిజన్ క్లబ్ అధ్యక్షుడిగా నాయిని యాదగిరి, ఉపాధ్యక్షులుగా సీతారామ్మూర్తి, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా దుంబాల భూపాల్‌రెడ్డి, కోశాధికారిగా సుధగాని మల్లయ్యగౌడ్, క్రీడల కార్యదర్శిగా గంగాల నరేశ్ ఎన్నికయ్యారు.

న్యాయవాదికి సేవారత్న అవార్డు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 11: సిద్దిపేటకు చెందిన న్యాయవాది రాజలింగం జాతీయ సేవారత్న అవార్డును ఆదివారం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. ఈ సందర్భంగా బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు అవార్డు సెలక్షన్ నేషనల్ కమిటీ చైర్మన్ నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో యేటా ప్రజా ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు, రచయితలు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది సిద్దిపేటకు చెందిన న్యాయవాది రాజలింగానికి జాతీయ సేవా రత్న అవార్డు అందించామన్నారు.

శభాష్.. అలయన్స్


వివాహ వేడుకలో అలయన్స్ క్లబ్ సభ్యులు

నిరుపేద వధువు పెండ్లి చేసిన అలయన్స్ క్లబ్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 11 : నిరుపేద వధువు వివాహానికి అన్నీ తానై వివాహం చేసి సిద్దిపేట అలయన్స్ క్లబ్ ఆదర్శంగా నిలిచింది. సిద్దిపేట శివారు పొన్నాల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన తేజశ్వినికి కొండాపూర్ గ్రామానికి చెందిన వరుడితో ఆదివారం ఘనంగా వివాహం జరిపించారు. ఈ సందర్భంగా అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ ఆత్మరాములు, జిల్లా గవర్నర్ వనజ మాట్లాడుతూ వధూవరుల తరపున వచ్చిన సుమారు 400 మందికి భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 8 వివాహాలు చేశామన్నారు. ఈ వివాహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజ నర్సు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకలో నాయకులు పెద్ది వైకుంఠం, రాజేశ్వర్‌రెడ్డి, శివకుమార్, రామచంద్రం పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 11: వడ్డెర కులస్తులను బీసీ నుంచి తొలిగించి ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఈ అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు కుంచం శేఖర్, పట్టణ అధ్యక్షుడు తిరుపతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులు మారినా వడ్డెర కులస్తుల్లో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవితాల్లో నూతన కాంతులు రావాలంటే వడ్డెర విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. బండ క్వారీలపై పూర్తి హక్కును వడ్డెరులకు కల్పించాలని కోరారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు కృష్ణ, రవి, యాదగిరి, మల్లేశం, అరవింద్, రవీందర్, స్వామి, నాగరాజు, ప్రశాంత్, వినయ్ పాల్గొన్నారు.